క్లుప్తంగా

ఇందిరమ్మ ఇండ్లు అర్హులకే ఇవ్వాలి



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల రూరల్: అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని ప్రతీ గ్రామంలో పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పంచిరి విజయ్ కుమార్, సీనియర్ నాయకుడు గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబల్ల సుదర్శన్,భూమానందం, నరేందర్, రాజు, ప్రశాంత్, శ్రీపతి రెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'అమృత్' పనులు ప్రారంభించాలని నిరసన



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయికల్: కేంద్ర ప్రభుత్వం బల్దియా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గాను రూ.15.20 కోట్ల నిధులతో అమృత్ జల్ 2.0కు నిధులు మంజూరు చేయగా, ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా బల్దియాలో 20 వేల ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందుతుందని గుర్తుచేశారు. వెంటనే పనులుప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ మనోహర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బన్న హరీశ్, కూనారపు భూమేశ్, దాసరి రవి, తోపారపు ఆశన్న, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిస్తే జైలుకే

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనం నడిపితే జైలుకెళ్లడం తప్పదని ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ అన్నారు. అతిగా మద్యం సేవించి వాహనం నడిపి పట్టుబడిన వ్యక్తికి శుక్రవారం న్యాయమూర్తి ఐదు రోజుల జైలుశిక్ష విధించారు. జగిత్యాల పట్టణంలో గురువారం కొత్తబస్టాండ్ చౌరస్తాలో ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ వాహనాల తనిఖీ చేపట్టగా ఆంధ్రప్రదేశ్‌లోని బీమారంకు చెందిన దేవండ్ల శ్రీధర్ అతిగా మద్యం సేవించి వాహనం నడుపగా ట్రాఫిక్ ఎస్సై పట్టుకుని అతనిపై కేసు నమోదు చేశారు. నిందితున్ని శుక్రవారం స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ సెకెండ్ క్లాస్ న్యాయమూర్తి కరుణాకర్ ముందు హాజరు పర్చగా ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

గోశాలలో రైతు శిక్షణ శిబిరం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలోని సురభి గోశాలలో రైతులకు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గోశాల అధ్యక్ష, కార్యదర్శులు తురగ రాజిరెడ్డి, కార్యదర్శి బండారి కమలాకర్‌రావు తెలిపారు. ఈనెల 18న ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు గోశాల ఆవరణలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని, దేశ సౌభాగ్యం, సామాన్య ప్రజల ఆరోగ్యం ఆర్థిక వికాసం, పర్యావరణ పరిరక్షణ కోసం గో ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

ఒకే చెట్టుకు రెండు రకాల మందారాలు



రెండు పువ్వులు పూసిన చెట్టు

రాయికల్: పట్టణంలోని వాసం దిలీప్ ఇంట్లో శుక్రవారం ఒకే చెట్టుకు రెండు రకాల మందారాలు పూశాయి. ఎరుపు, గందం పూలు పూయడంతో కాలనీవాసులు ఆశ్చర్యంగా తిలకించారు. కాగా, ఇలా జరగడం అరుదు అని మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ తెలిపారు.

డయల్ 100.. సత్వర సాయం

- జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం రోలవాగు వద్ద నెల రోజుల క్రితం నిర్మల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి ఎండ్రికాయలు పట్టేందుకు రాగా పాము కాటువేసింది. దీంతో అతను 100 డయల్ చేయడంతో సత్వరమే పోలీసులు అక్కడకు వెళ్లి అతన్ని పోలీసులు చేరదీసి 108కు కాల్ చేసి ఆస్పత్రికి తరలించారు.
- జిల్లా కేంద్రంలోని శ్రీరామ థియేటర్ వద్ద గత 20 రోజుల క్రితం ఓ ప్రేమ జంటపై కొంత మంది దాడిచేయగా, వారు డయల్ 100కు కాల్ చేయడంతో సత్వరమే అక్కడకు చేరుకుని ప్రేమ జంటకు రక్షణ కల్పించారు.
- జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులో ఇటీవల రోడ్డు ప్రమాదం జరుగగా స్థానికులు డయల్ 100కు కాల్ చేయడంతో సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని వారిని 108 ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

- ఆపద సమయంలో రక్షణ కల్పిస్తూ..
- ప్రాణాలు కాపాడుతున్న పోలీసులు
- 2024లో 29,559, జనవరి నుంచి ఇప్పటి వరకు 11,575 కాల్స్



రోళ్లవాగు వద్ద పాముకాటుకు గురైన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాలో పోలీసు శాఖ ఏర్పాటు చేసిన డయల్ 100 కాల్‌కు భారీగా స్పందన వస్తోంది. ఆపదలో ఉన్న వారితో పాటు, ప్రమాద సంఘటన వివరాలను, ఇతర నేరాలు జరుగుతున్న సమయంలో డయల్ 100కు కాల్ చేస్తే వెంటనే పోలీసులు అక్కడకు వెళ్లి సంఘటన చిత్రీకరించడంతో పాటు, సరైన సాక్ష్యాధారాలు సేకరించడంతో పాటు, ఆపదలో ఉన్న వారికి రక్షణగా నిలుస్తున్నారు. జిల్లాలో 2023లో 26,213 డయల్ 100 కాల్స్ రాగా, 2024లో 29,559 కాల్స్ చేశారు. 2025లో ఇప్పటి వరకు 11,575 డయల్ 100 కాల్స్ వచ్చాయి. పోలీసులు సత్వరమే స్పందించి బాధితులకు సేవలందిస్తున్నారు.

భారీ స్పందన

రాష్ట్రవ్యాప్తంగా సత్వర పోలీసు సేవలందించేందుకు ఏర్పాటు చేసిన డయల్ 100కు కాల్ చేస్తే వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వారిని రక్షించడంతో పాటు వారికి సత్వరమే వైద్య సేవలు అందేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా డయల్100కు రోజురోజుకు కాల్స్ చేస్తూ వారి సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

డయల్ 100 తో సత్వర సేవలు

జిల్లాలో డయల్100కు కాల్ రాగానే పోలీసు శాఖ బాధితులకు సత్వరమే సేవలందిస్తోంది. ఆపదలో ఉన్న ప్రతీ ఒక్కరు డయల్ 100 కు కాల్ చేయడంతో నేరాలు కూడా పోలీసులు సత్వరమే నియంత్రిస్తున్నారు. దోపిడీ, దొంగతనాలు, తగాదాలు, రోడ్డు ప్రమాదాలు, హత్యలు, హత్యాయత్నాలు, ఆత్మహత్యలు, తప్పిపోవుట, కిడ్నాప్, అత్యాచార యత్నాలు, గృహహింస, అసాంఘిక కార్యకలాపాలు ఆపదలు సంభవించిన సందర్భంలో 'డయల్ 100' సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

కాల్ రాగానే తక్షణ సేవలు



జిల్లాలో ఆపద సమయంతో పాటు ప్రమాదంలో ఇతర సమయాల్లో పోలీసు సేవలు అత్యవసరమైతే డయల్ 100కు కాల్ చేసిన వారికి సత్వరమే స్పందించి వారికి సేవలందిస్తున్నాం. ప్రజలు అత్యవసరమున్నా డయల్ 100కు కాల్‌చేస్తే సత్వరమే పోలీసు సేవలందిస్తాం.

– అశోక్‌కుమార్, ఎస్పీ

ఇసుక అందుబాటులో ఉండేలా చూడండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల: ఇసుకకు సంబంధించి జిల్లాలో సాండ్ స్టాక్ యార్డు ఏర్పాటు చేయాలని జగిత్యాలకు వచ్చిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం అభినందనీయమని, కానీ ఇసుక దొరకడం ఇబ్బందికరంగా ఉందన్నారు.గతంలో స్టాక్ పాయింట్ ధరూర్ క్యాంప్ రామాలయం సమీపంలో ఏర్పాటు చేశారని, వేరే చోట ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

మంత్రి పర్యటనలో అనూహ్య పరిణామం

జగిత్యాలటౌన్: జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటికి ఊహించని పరిణామం ఎదురైంది. జిల్లా కేంద్రంలోపలు సమస్యలపై మంత్రికి జీవన్ రెడ్డి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తనతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డిని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఆప్యాయంగా ఆలింగనం చేసుకోపోగా అయిష్టంగా వెనుకడుగు వేసిన జీవన్‌రెడ్డి 'మీ రాజ్యం మీరు ఏలుకోండి, ఇక మా పని అయిపోయింది' అంటూ నిర్వేదంగా మాట్లాడి మంత్రికి నమస్కరించడంతో కంగుతిన్న మంత్రి తేరుకుని ప్రతి నమస్కారం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మున్సిపల్ కార్మికుల జీతాల్లో కోత

జగిత్యాల: అవుట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికుల జీతాల్లో కోత విధించారని మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి జగిత్యాల జిల్లా మున్సిపాలిటీ స్వచ్ఛభారత్ అవుట్ సోర్సింగ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లో అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి పాత జీతాలు చెల్లించాలని స్పష్టంగా నిబంధన ఉందని, కొత్తగా నియమించిన సిబ్బందికి మాత్రమే నిబంధనలు వర్తిస్తాయన్నారు. తమకు మార్చి నెలలో వేసిన జీతమే మళ్లీ పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మాజీ మావోయిస్టు నారాయణ మృతి



నారాయణ (ఫైల్)

కోరుట్లరూరల్: మండలంలోని సర్వరాజ్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు పందుగ నారాయణ(75) అలియాస్ పి.నారాయణ సార్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. నారాయణ గతంలో ఏడేళ్ల పాటు మావోయిస్టు పార్టీలో పని చేశారు. భూస్వాములకు వ్యతిరేకంగా పనిచేసిన తొలితరం నక్సలైట్ నాయకుల్లో నారాయణ ఒకరు. 1978 జూలై 17న నిర్వహించిన జగిత్యాల జైత్రయాత్రలో నారాయణ చురుకైన పాత్ర పోషించారు. ఎమర్జెన్సీ సమయంలో అజ్ఞాతంలోకి వెళ్లిన నారాయణ అనంతరం కొంత కాలం జైలు జీవితం గడిపారు. 1984 లో జైలునుంచి విడుదలై హైదరాబాద్‌లో సిటీ బస్ కండక్టర్‌గా పని చేసి రిటైర్డ్ అయ్యారు. తర్వాత సర్వరాజ్‌పూర్‌లో స్థిరపడ్డారు. మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

కత్తులతో దాడిచేసిన ఏడుగురి అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం, లింగంపేట శివారులో అంతర్గాం గ్రామానికి చెందిన అరవింద్ బర్త్‌డే వేడుకలు నిర్వహిస్తుండగా కత్తులతో దాడిచేసిన ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. అంతర్గాంకు చెందిన అరవింద్, గంగాధర్, వంశీపై గురువారం రాత్రి కత్తులతో దాడిచేసిన అదే గ్రామానికి చెందిన అదరవేని రాకేశ్, మహేశ్, మహంకాళి అజయ్, అదరవేని రాజమల్లు, గజ్జల చందు, అదరవేని లింగస్వామి, శ్రావణ్‌కుమార్‌ను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న మూడు కార్లు

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణ శివారులోని ఆరపేట వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాలు.. పట్టణంలోని ఓ డ్రైవింగ్ స్కూల్‌కు చెందిన కారు శుక్రవారం మెట్‌పల్లి నుంచి కోరుట్ల వైపు వెళ్తోంది. ఈ క్రమంలో ఆరపేట వద్ద రహదారిపై ఒక్కసారిగా కారు ఆగిపోయింది. ఆ సమయంలో కోరుట్ల వైపు నుంచి వస్తున్న కారు డ్రైవర్ అప్రమత్తమై కారును ఆపాడు. దీంతో వెనకాలే ఒకదాని వెనుక ఉన్న మూడు కార్లు ఢీకొన్నాయి. మూడు కార్లు ధ్వంసం కాగా వాహనదారులంతా మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

హమాలీపై అడవిపంది దాడి

సారంగాపూర్: మండలంలోని నాయికపుగూడెం కొనుగోలు కేంద్రంలో గురువారం రాత్రి హమాలీలు నిద్రిస్తుండగా అడవిపంది దాడి చేసింది. బిహార్‌కు చెందిన జమీదార్‌కు గాయాలయ్యాయి. బాధితుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

ఈతచెట్లు దగ్ధం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేటలో శుక్రవారం ఈత చెట్లు దగ్ధమయ్యాయి. 5 ఎకరాల్లో ఉన్న ఈతచెట్లలో వందల చెట్లు దగ్ధమైనట్లు గౌడ కులస్తులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం

రాయికల్: రాయికల్ పట్టణంలోని నీలి పెద్ద రాముకు చెందిన ఎలక్ట్రిక్ బైక్ శుక్రవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. తన తోటలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా వాహనం నుంచి ఒక్కసారిగా పొగలు రావడంతో గమనించిన యజమాని బ్యాటరీ స్విచ్ ఆఫ్ చేసినా వాహనం మాత్రం పూర్తిగా కాలి బూడిదైంది.

విద్యుత్ షాక్‌తో పాడిగేదెలు మృతి

పెగడపలి: మండలంలోని నంచర్లలో వరాల లింగయ్య, కత్తి లచ్చయ్య, కొత్త రవికి చెందిన మూడు పాడి గేదెలు విద్యుత్ షాక్‌తో మృతిచెందాయి. గేదెలు మేతకు వెళ్లాయి. గ్రామ శివారులో విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగి పడటంతో స్తంభాలు నెలకొరిగి తీగలు తెగిపడ్డాయి. మేతకు వెళ్లిన మూడు గేదెలు తీగలకు తాకడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాయి. ఒక్కో గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



పెగ్గెర్లలో బడిబాటలో ఎంఈవో, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు



వర్షకొండలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోరుట్ల: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని హెచ్‌ఎం సునావత్ రాజు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని గడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం పేరెంట్స్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి నరేశం అన్నారు. ఈ మేరకు మండలంలోని యూసుఫ్‌నగర్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట చేపట్టారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుగ్గిళ్ల సురేశ్ గౌడ్, గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని హెచ్‌ఎంలు రాజేందర్, శంకర్ అన్నారు. మండలంలోని వర్షకొండ రైతు వేదికలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సమావేశం నిర్వహించారు. విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రైవేట్ పాఠశాలలకు పంపించవద్దని కొరారు. పదో ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లావణ్య, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్లాపూర్: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈవో కేతిరి దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బడిబాట కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులు బడిబాట కరపత్రాలను రూపొందించడం అభినందనీయమన్నారు.అనంతరం పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మైనార్టీ విద్యార్థులను మెట్‌పల్లి ప్రభుత్వ మైనార్టీ పాఠశాల, జూనియర్ కళాశాలలోనే చేర్పించాలని ప్రిన్సిపాల్ తిరుపతి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండలంలోని హుస్సేన్‌నగర్‌లోని మజీద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మైనార్టీ పాఠశాల, కళాశాల ఆధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ సయ్యద్ హైదర్ ఆధ్వర్యంలో 15మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. కార్యక్రమంలో మైనార్టీ కళాశాల ఆధ్యాపకులతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలో శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ముందస్తు బడిబాట నిర్వహించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి కొత్త అడ్మిషన్లు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో లోకిని శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అర్జున్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులంలో చేర్పించాలని ప్రచారం

మెట్‌పల్లి: గురుకులాల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని పలు మసీదుల్లో శుక్రవారం క్యాంపెనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల మైనార్టీ విభాగంలో 5 నుంచి 9 తరగతులకు, ఇంటర్ ఎంపీసీ,బైపీసీ విభాగాల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు. గురుకులంలో కల్పిస్తున్న సౌకర్యాలు,వసతుల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు శిఖం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న గంగపుత్రులు

మల్యాల: కొంపల్లె చెరువు శిఖం భూమిలో బావులు తవ్వి, మోటార్లు పెట్టి, చెరువులను ఆక్రమించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని గంగపుత్రులు అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ మునీందర్, నీటిపారుదల శాఖ అధికారులకు గంగపుత్రుల వినతిపత్రం సమర్పించారు. కొంపల్లె చెరువులోని శిఖం భూమిలో మల్యాల గ్రామానికి చెందిన రైతులు బావులు తవ్వుతున్నారని, చెరువు శిఖం ఆక్రమించుకుంటున్నారని లంబాడిపల్లి గ్రామానికి చెందిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువులో బావులు తవ్వడంతో చేప పిల్లల పెంపకానికి ఇబ్బందులు తలెత్తడంతోపాటు, తాము ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఇటిక్యాల రాజయ్య, ఉపాధ్యక్షుడు బండారి నర్సయ్య, కార్యదర్శి జగిత్యాల గంగరాం, నాయకులు మిల్కూరి మల్లారెడ్డి, మల్యాల గంగపుత్ర సంఘం అధ్యక్షుడు రుత్త కిషన్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పంటల సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

మల్యాల: మండలంలోని పోతారంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతులకు సాగులో వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. నీటి యాజమాన్యం, పంటల మార్పిడి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతి రైతు పేరునమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రజనీకాంత్, సాయినాథ్, ఏవో కె.చంద్రదీపక్, ఏఈవోలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

▶ **బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు సన్మానం**

సారంగాపూర్: బీర్‌పూర్ తహసీల్దార్‌గా పనిచేసిన ముంతాజొద్దీన్ శుక్రవారం బదిలీ కావడంతో ఆయనను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐలు శ్రీనివాస్, రాహుల్, సిబ్బంది పాల్గొన్నారు.

▶ **స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి**

జగిత్యాల: 2024–25 విద్యాసంవత్సరానికి గాను జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థులు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులకు తెలిపి దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. TELANGANAEPASS.CGG.GOV.IN లో ఆన్‌లైన్ స్కాలర్‌షిప్‌లు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

▶ **యూరియా వాడకాన్ని తగ్గించాలి**

జగిత్యాలఅగ్రికల్చర్: పంటల్లో యూరియా వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ పి.రవి, డాక్టర్ కె.స్వాతి అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని మోతె గ్రామంలో శుక్రవారం రైతు ముగింటకు శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలకు సంబంధించిన బ్రోచర్‌ను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యూరియా వాడకం పెరిగితే భూమినిస్సారం అవుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు అఖిల, నూర, వ్యవసాయాధికారి వినీల, ఏఈవో నాగరాజు, అన్వేష్ పాల్గొన్నారు.

▶ **సీపీఐ మండల కార్యవర్గం ఎన్నిక**

మేడిపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) మేడిపల్లి మండల శాఖ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా మునుగూరి హన్మంతు, సహాయ కార్యదర్శిగా చిలువేరి గంగాచారి, కార్యవర్గ సభ్యులుగా రాంపెల్లి రవీందర్, గుగ్గిళ్ల గంగాధర్, గంగనర్సయ్య, బెక్కం గంగారాజంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎద్దండి భూమయ్య, పిట్టల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

▶ **ఐఎంఏ మెంబర్‌గా గంగాసాగర్**

మెట్‌పల్లి: ఐఎంఏ జాతీయ వైద్య విధాన రాజ్యాంగ సవరణ,ఆమోద కమిటీ మెంబర్‌గా మెట్‌పల్లి పట్టణానికి చెందిన వైద్యుడు గంగాసాగర్ నియామకమయ్యారు. ఈ మేరకు ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు దిలీప్ భానుశాలి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన గంగాసాగర్‌కు పలువురు అభినందనలు తెలిపి సన్మానించారు.

▶ **90 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి**

ఇబ్రహీంపట్నం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 90 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, ఇంకా 10 శాతం కొనుగోళ్లు పూర్తి కావాల్సి ఉందని మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కొనుగోళ్లు సజావుగానే కొనసాగుతున్నాయని, వర్షాలతో ఆలస్యమైందన్నారు. కొనుగోళ్లు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, యామాపూర్, తిమ్మాపూర్ సింగిల్‌విండో చైర్మన్లు అంకతి రాజన్న, బాస శ్రావణ్, నాయకులు పాల్గొన్నారు. లు పెద్ద ఎత్తున తరలిరావాలని పేర్కొన్నారు.

▶ **నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఉదయం 9 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు వినియోగదారులు సహకరించాలని కోరారు.

డెంగీ నిర్మూలనకు కృషి చేయాలి



వేంపేటలో ర్యాలీ తీస్తున్న వైద్యసిబ్బంది

మెట్‌పల్లిరూరల్: ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూడాలని, ప్రతీ మంగళ,శుక్రవారం డ్రైడేగా పాటించి డెంగీ వ్యాధిని అరికట్టాలని మెట్‌పల్లి మండలం వేంపేటలో వైద్య సిబ్బంది ,గ్రామస్తులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రజలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో,పరిసరాల్లో ఉండే నీటి కుంటల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. డెంగీ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, సబ్‌యూనిట్ అధికారి మీర్జా విలాయత్ బేగ్, వైద్యులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సారంగాపూర్: డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాధ అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో పాటు, ఆశా, ఏఎన్‌ఎంలు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు చేరి, వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కుద్దూస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో సంకష్టి వేడుకలు



సంకష్టి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల ఆలయంలో శుక్రవారం సంకష్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నలమాసు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.